Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 130
సంచిక : 245
పేజీలు : 3
బుధవారం, మే 20, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN



## న్యాయం కోసం వెళ్తే..

# గర్భవతిని చేసిన సీఐ

### -ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు

**టి మీడియా ,మే 19 ,ఖమ్మం :** భర్త వేధిస్తున్నాడని న్యాయం చేయాలని ఓ మహిళ.. మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది.. పోలీసులకు ఫిర్యాదు చేసింది.. అయితే.. ఆ మహిళ పై కన్నేసిన సీఐ న్యాయం చేస్తానంటూ దగ్గరయ్యాడు.. ప్రేమ, పెళ్లి పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.. గర్భవతిని చేశాడు.. పెళ్లి గురించి అడిగితే టాబ్లెట్లు మింగించి అబార్షన్ చేయించాడు.. వివాహితపై వేధింపులకు పాలడ్డ సిసిఎస్ సిఐ రాజుపై కేసు నమోదవ్వడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఖమ్మం కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీఐ భూక్యా రాజు నాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ ఖమ్మంలో జరిగిన ఈ ఘటన తెలంగాణలో కలకలం రేపింది.

**వివరాల ప్రకారం..**

వివాహిత మహిళను వేధించిన వ్యవహారంలో ఖమ్మం సి సి ఎస్ స్టేషన్ సి ఐ బానోత్ రాజుపై ఖమ్మం 2టౌన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది.. 2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు పేర్కొంది.ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దాటవేస్తుండటంతో.. బాధితురాలు ఈనెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో సీఐ వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు అతన్ని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.కాగా.. బాధితురాలికి ఇటీవలే ఆమె భర్త నుంచి కోర్టు ద్వారా విడాకులు మంజూరయ్యాయి. ఆమెకు విడాకులు ఇప్పించేందుకు సీఐ రాజు నాయక్ ఆమె భర్తపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

## మండల పరిషత్ కార్యాలయంలో

# అటకెక్కిన పారిశుద్ధ్యం

అధికారులు మారిన పారిశుద్ధ్యం పై నిర్లక్ష్యం

చెత్త చెదారంతో ఎంపీడీవో కార్యాలయం

ఆఫీసు చక్కదిద్దుకోలేని అధికారులు -

గ్రామాలను ఎలా శుభ్రం చేస్తారు..?

2లో...

## పకడ్బందీగా జనగణన

# సర్వే నిర్వహించాలి

### -ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ అంకిత్



**టి మీడియా ,మే 19 , అశ్వాపురం:** మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పలు కార్యక్రమాలను ఆకస్మికంగా పరిశీలించారు. మల్లెలమడుగు గ్రామంలో నిర్వహిస్తున్న సెన్సస్--2027 జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం, సీతారాంపురంలోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ కూడా కలెక్టర్ వెంట పాల్గొన్నారు .మల్లెలమడుగు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లతో కలెక్టర్ మాట్లాడి, వివరాల నమోదు విధానం, డేటా సేకరణ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలో జరుగుతున్న 16వ జనగణన ఇదేనని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి జనగణన కావడం విశేషమన్నారు. ఈసారి తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు.జనగణనలో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఒక్కో కుటుంబానికి సంబంధించిన వివరాలను సుమారు ఐదు నిమిషాల్లోనే నమోదు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ఎన్యూమరేటర్ల ఐడీ కార్డులపై ఉన్న క్యూ ఆర్ (ఉక్మ్) కోడ్‌ను స్కాన్ చేస్తే వారి పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలు అధికారిక సిబ్బందికి సహకరించి ఖచ్చితమైన సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచార సేకరణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రతి ఇంటిని కవర్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు, రైతులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిన్నటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, ప్రస్తుతం ఉన్న నిల్వలు, రైతుల నుంచి ధాన్యం రాక పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రస్తుతం కేంద్రంలో 5,550 ధాన్యం బ్యాగులు నిల్వలో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.కొనుగోలు కేంద్రానికి మ్యాపింగ్ చేసిన రైస్ మిల్లుల వివరాలు, ధాన్యం తరలింపు ప్రక్రియ, లోడింగ్--అన్‌లోడింగ్ పరిస్థితులు, లారీల లభ్యత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం, రికార్డు నమోదు, నిల్వ, రవాణా వంటి ప్రక్రియలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా ధాన్యం పేరుకుపోకుండా మిల్లులకు సకాలంలో తరలించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ధాన్యం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ తేమ శాతం, శుభ్రత, నిల్వ విధానం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల మేరకు పారదర్శకంగా

# వలస గిరిజనేతరులు ఏజెన్సీ నుండి వెళ్ళిపోవాలి



### నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి

**టీ మీడియా,మే19, ములుగు బ్యూరో :**ములుగు జిల్లా లో తలండి రాంబాబు పైన జరిగిన దాడి యావత్తు ఆదివాసీ జాతి పైన జరిగిన దాడి గా ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి పేర్కొన్నారు.. వెంకటాపురం గ్రామానికి చెందిన తలండి రాంబాబు అనే ఆదివాసీ ఇంట్లోకి పట్టపగలే వెళ్లి వలస గిరిజనేతరుడి అనుచరులు రాంబాబు పైన తన కూతుర్ల పైన ఆదివారం దాడి చేసినట్లు బాధితులు చెప్పినట్టు నర్సింహా మూర్తి తెలిపారు. ఆదివారం సెలవు రోజు అని భావించి పక్క పథకం ప్రకారం ఆదివాసీల పైన దౌర్జన్యం చేసి దాడి చేయడం హ్యే?యమైన చర్య అన్నారు. ఆదివాసీ కుటుంబం పైన జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో మంగళవారం మూడు వందల మంది తో ప్రధాన రహదారి పై ర్యాలీ నిర్వహించి రహదారి పై బైఠయించి . భారీ రాస్తారోకో నిర్వహించారు. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిపోయాయి.సీఐ ముత్యం రమేష్,ఎస్సై కొప్పుల తిరుపతిరావు అక్కడికి చేరుకొని నిరసన కారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసిన వినకపోవడంతో ఎమ్మార్వో వేణుగోపాల్, ఎంపీడీఓ జుమ్మి లాల్ వచ్చి సమస్య తెలుసుకొన్నారు. వలస గిరిజనేతరుడు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని రెవిన్యూ డిపార్ట్మెంట్ స్వాధీనం చేసుకోవాలని , ఎల్ టి ఆర్ కేసు నమోదు చేయాలని ఎమ్మార్వో ని కోరినారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బట్టల షాప్ ని తక్షణమే సీజ్ చేయాలని, అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే మీరు ఏమి చేస్తున్నారని ఎంపీడీఓ జుమ్మి లాల్ ని నిలదీశారు. తలండి రాంబాబు పైన దాడి చేసిన వలస గిరిజనేతరుడి పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తో పాటు క్రిమినల్ కేసులు బనాయించాలని పోలీస్ వారిని కోరినారు. గిరిజనుడు అయిన తలండి రాంబాబు ఎటువంటి హాని కలిగించిన మరిన్ని కేసులు పెడతామని, ఇప్పటికే దాడికి పాల్పడ్డ వారి పైన కేసులు పెట్టినట్టు పోలీస్ వారు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలస గిరిజనేతరుడు అయిన రాజమౌళి ఎటువంటి అనుమతులు లేని అక్రమ వ్యాపారాలను తక్షణమే సీజ్ చేయాలని పెద్ద ఎత్తున ఆదివాసీలు నినాదాలు చేశారు. మైదాన ప్రాంతం నుండి వలస వచ్చిన గిరిజనేతరులు ఈ ప్రాంతంలో అక్రమ వ్యాపారాలు చేసి ఆదివాసీలను



## మండల పరిషత్ కార్యాలయంలో అటకెక్కిన పారిశుద్ధ్యం

**అధికారులు మారిన పారిశుధ్యం పై నిర్లక్ష్యం**

**చెత్త చెదారంతో ఎంపీడీవో కార్యాలయం**

**ఆఫీసు చక్కదిద్దుకోలేని అధికారులు - గ్రామాలను ఎలా శుభ్రం చేస్తారు..?**

**టీ మీడియా,మే19,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం చెత్త చెదారంతో నిండిపోయి ఉండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కార్యాలయ ఆవరణలో చెత్త పేరుకుపోవడం, పరిశుభ్రత లేకపోవడం వంటి పరిస్థితులు నెలకొనడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నప్పటికీ, మండల కేంద్రంలోని కీలక కార్యాలయమైన పారిశుద్ధం నిర్లక్ష్యానికి గురవడం విమర్శలకు దారితీస్తోంది.గతంలో కూడా కార్యాలయ పరిశుభ్రతపై పలుమార్లు వార్తలు ప్రచురితమైనప్పటికీ అధికారులు మాత్రం తీరు మార్చుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముందుగా తమ కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోలేని అధికారులు గ్రామాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.కార్యాలయానికి ప్రతిరోజూ వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు చెత్త వాసనలు, అపరిశుభ్ర వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వెంటనే ఎంపీడీవో కార్యాలయ పరిసరాలను శుభ్రపరచి,పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## దోపిడీ లేని సమాజాన్ని నిర్మించడమే

**-సుందరయ్య కి ఘన నివాళి**

**టి మీడియా ,మే 19 ,ఎర్రుపాలెం:** పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని ఎర్రుపాలెం మండల కేంద్రంలో కామ్రేడ్ రామిశెట్టి పుల్లయ్య భవన్ నందు నిర్వహించారు. అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు దివ్వెల వీరయ్య, సిపిఎం మండల కార్యదర్శి మద్దల ప్రభాకరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం వారు మాట్లాడుతూ దేశంలో సామాజిక వివక్షత, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించడానికి నిరంతరం శ్రమించిన మహానేత అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని పేర్కొన్నారు. శ్రమజీవుల హక్కుల కోసం పేదల ఆత్మగౌరవం కోసం సుందరయ్య రాజీలేని పోరాటాలు చేశారన్నారు దున్నేవానికి భూమి నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనమైన చరిత్ర సిపిఎం పార్టీదని పేర్కొన్నారు. నేటి సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న దోపిడి పై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, రాబోయే రోజుల్లో పేదల పట్ల, నవ సమాజ నిర్మాణం కొరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. సుందరయ్య ఆశయాలను నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదిగం బసవయ్య నక్క పుల్లారావు, తాళ్లూరి వెంకటనారాయణ,కోటి సుబ్బారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

## సంతలో ఆవులు, ఎద్దుల విక్రయాలపై నిషేధం

**టీ మీడియా, మే 19 ,కామేపల్లి:** మండలంలోని కొమినేపల్లి పంచాయతీ పరిధిలో స్థానిక శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంతలో ఈ నెల 20, 27 తేదీల్లో (బుధవారాలు) ఆవులు, ఎద్దులు, కోడెల అమ్మకాలు, కొనుగోళ్లను పూర్తిగా నిషేధించినట్లు సంత కాంట్రాక్టర్ భూక్యా వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, మేకలు, గొర్రెల వ్యాపారం యధావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా పశువులను తరలించినా, క్రయవిక్రయాలు జరిపినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు, వ్యాపారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.



# మొక్కజొన్న బస్తాల దిగుమతిలో జాప్యం

**రైతులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు**

**స్థానిక రైతులవాహనాలికు అవకాశం కల్పించాలి : రైతు సంఘం**



**టీ మీడియా,మే19,సింగరేణి(కారేపల్లి):**ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న మొక్కజొన్న బస్తాల దిగుమతిలో తీవ్ర జాప్యం జరుగుతోందని,వెంటనే చర్యలు తీసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న స్టాక్ పాయింట్‌ను రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ పరిశీలించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న రైతులు, ట్రాక్టర్, లారీ డ్రైవర్లతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దిగుమతి కేంద్రంలో సరైన సమన్వయం లేకపోవడం వల్ల వాహనాలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా స్థానిక రైతుల ట్రాక్టర్లు, లారీలకు సరైన అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు.రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ, కారేపల్లి జిన్నింగ్ మిల్లులో స్థానిక రైతుల వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దిగుమతి కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం బాధాకరమన్నారు.మంచినీటి వసతి లేక రైతులు, డ్రైవర్లు ఎండలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఒక్క దిగుమతి పాయింట్ నిండిన తర్వాతే మరో పాయింట్ ప్రారంభించడం వల్ల వాహనాలు భారీగా పేరుకుపోతున్నాయని, దీంతో రైతులకు అదనపు ఖర్చులు వస్తున్నాయని చెప్పారు.ఒకేసారి ఎక్కువ పాయింట్లలో దిగుమతులు చేపడితే సమస్యలు తగ్గుతాయని సూచించారు.మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతిరోజూ సమీక్షించాలని రైతు సంఘం నేతలు కోరారు.జిన్నింగ్ మిల్లుకు వచ్చిన మార్క్‌ఫెడ్ అధికారులకు సమస్యలను వివరించి వెంటనే పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కారేపల్లి మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, కార్యదర్శి వజ్జా రామారావు, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



## మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**టీ మీడియా మే 19 కూసుమంచి:**కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలని నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కూసుమంచి బస్టాండు సెంటర్లో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయం నుండి నిరసనగా ఆటోకి తాళ్లు కట్టి బస్టాండు సెంటర్ వరకు లాగారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు మాట్లాడుతూ.. దేశ ప్రధాని మోడీ మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎన్నికల ముందు అసలు దేశంలో పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచే ప్రసక్తే లేదని ప్రకటించిన మోడీ 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పెట్రోల్, డీజిల్ రేటు పెంచి తన బుద్ధుని చాటుకున్నాడని ఆయన విమర్శించారు వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, సిపిఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి, పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్,హళావత్ నరసింహ, నాయకులు ఎల్లంపల్లి అశోక్, పడిశాల శేషయ్య, ఎర్రబోయిన సురేష్, జవ్వాజి శ్రీను, ఉప్పయ్య, ఉన్నం బాబురావు, నవీన్, వీరబాబు, వీరన్న, నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, శ్రీను, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న స్టాక్ పాయింట్లను తనిఖీ చేసిన డీఎం

**టీ మీడియా,మే19,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని మొక్కజొన్న స్టాక్ పాయింట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎం జే.నరేందర్ మంగళవారం తనిఖీ చేశారు.అప్పాయిగూడెం గోదాం, జిన్నింగ్ మిల్ స్టాక్ పాయింట్లను డీఎం పరిశీలించారు.సోమవారం రాత్రి కారేపల్లిలో రైతులు అందోళనకు దిగటంతో విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రైతు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.సింగరేణి మండల రైతుల మొక్కజొన్నను స్థానికంగానే దిగుమతి చేయటానికి అవకాశాలు పరిశీలించాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు.కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ డీఎం గోదాంలను పరిశీలించారు.ఈసందర్బంగా సొసైటీ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, దుగ్గి కృష్ణ, లు జిన్నింగ్ మిల్లు స్టాక్ పాయింట్‌లో కారేపల్లి మండల రైతులకు అవకాశం కల్పించాలని డీఎంను కోరారు.వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో పోన్‌లో డీఎంతో మాట్లాడి స్థానిక రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.డీఎం వెంట సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఉన్నారు.





## కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన రైతు కమిషన్ సభ్యులు మేక సునీల్

**మిల్లర్ల కోత, లారీల జాప్యంపై రైతుల ఫిర్యాదు**

**టీ మీడియా, మే 19, కురవి:**తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు మేక సునీల్ రెడ్డి కురవి మండలంలోని ఆంధ్రా బ్యాంక్ సొసైటీ, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రైతు కమిషన్ అధ్యయనం చేస్తోందని, అందులో భాగంగానే మంగళవారం కురవి కేంద్రాలను తనిఖీ చేసినట్లు సునీల్ రెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తిస్థాయి మౌలిక సౌకర్యాలను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుందని ఆయన వెల్లడించారు.కేంద్రాల్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లను స్వయంగా పరిశీలించిన ఆయన, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోవద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యంలో అధికంగా కోత విధిస్తున్నారని, లారీల రవాణా సక్రమంగా లేకపోవడంతో ధాన్యం తరలింపు ఆలస్యమై రోజుల తరబడి కేంద్రాల్లోనే వేచి ఉండాల్సి వస్తోందని సునీల్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.రైతులు లేవనెత్తిన సమస్యలన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని మేక సునీల్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం దుర్గారావు, ఆర్ఐ లక్ష్మి, ఏవో నరసింహారావు, రైతులు మేక దామోదర్ రెడ్డి, బత్తిని నరసయ్య, బెడద వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి.

**టీ.మీడియా,మే19,చింతూరు:** పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సభను చింతూరులోని శ్యామల వెంకటరెడ్డి భవనంలో ఘనంగా నిర్వహించారు.తొలుత సుందరయ్య చిత్రపటానికి పలువురు నాయకులు కార్యకర్తలు పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చింతా రాంబాబు, ఎస్కే షాజహాన్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి బడుగు బలహీన వర్గాలకు అండదండగా ఉన్నారని, ఆనాటి భూస్వాముల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ పేద చిన్న కారు రైతుల అన్యాయాలకు ఎదురు నిలిచి భూమిలేని నిరుపేద రైతులకు తన సొంత భూములను దార దత్తం చేసి ఆనాడే గొప్ప దాతగా నిలిచిన ఏకైక వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఆయన బాటలోనే ఆశయ సాధన కోసం అందరూ కదలాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలువు పెద్ద రాములు, పోడియం లక్ష్మణ్, గంగరాజు పాల్గొన్నారు.



